సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



జిల్లా సమగ్రాభివృద్ధికి అందరి కృషి అవసరం 10లో



పారా ఒలింపిక్స్ శిక్షణకు ఏపీ మెడ్ టెక్ జోన్ ఆతిథ్యమిచ్చింది. భారత్‌కి చెందిన 21 మంది స్ఫూర్తిదాయకమైన వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పారా అథ్లెట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు.



పోక్సో కేసుల్లో ఎక్కువ మంది యువతే 10లో

న్యూస్‌రీల్

ఐజీ శ్రీనివాస్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం



ఐజీ శ్రీనివాస్‌కు అవార్డు అందజేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అరిలోవ: విశాలాక్షి నగర్ కేంద్రంగా ఉన్న కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) ఆరాధ్యుల శ్రీనివాస్ ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ పతకం అందుకున్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన సీఆర్పీఎఫ్ 86వ వార్షికోత్సవంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఆయన ఈ పతకం స్వీకరించారు. 34 ఏళ్లుగా శ్రీనివాస్ అందిస్తున్న సేవలు, ఆయన నాయకత్వ పటిమ, నిబద్ధత, దేశ భద్రతకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. స్థానికుడైన ఐజీ శ్రీనివాస్‌కు ఈ పురస్కారం లభించడం పట్ల సీఆర్పీఎఫ్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

24 నుంచి తొలి విడత చందనం అరగదీత



సింహాచలం: ఈ నెల 24 నుంచి సింహగిరిపై తొలి విడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు తెలిపారు. ఈ నెల 30న చందనోత్సవంనాడు నిజరూప దర్శనం అనంతరం తిరిగి స్వామికి మూడు మణుగు(125 కిలో)ల పచ్చి చందనాన్ని సమర్పించనున్నారు. దీనిలో భాగంగా 24న ఉదయం 6.30కు తొలిచందనం చెక్కకు పూజలు నిర్వహించి, అరగదీతను శాస్త్రోక్తంగా ప్రారంభిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 7.30 నుంచి దర్శనాలు మొదలవుతాయని పేర్కొన్నారు. సంవత్సరంలో 364 రోజులపాటు చందనంలో ఉండి దర్శనమిచ్చే స్వామి, వైశాఖ శుద్ధ తదియ రోజు మాత్రమే నిజరూప దర్శనం కల్పిస్తాడు. అదే రోజు అర్ధరాత్రి తర్వాత తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించి, నిత్యరూపభరితున్ని చేస్తారు. మళ్లీ వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.

అప్పన్న పట్టు వస్త్రాలకు రూ.20 వేలు

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి(దేవదాయశాఖ) వి.వినయ్ చంద్ గురువారం జీవో జారీ చేశారు. స్వామికి సమర్పించే పట్టువస్త్రం కొనుగోలుకు రూ.20 వేలు మంజూరుచేసినట్లు జీవోలో పేర్కొన్నారు.

విద్య, ఉపాధి కల్పనకు చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

మహారాణిపేట: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ద్వారకా నగర్‌లోని ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కూర్చుని సిబ్బంది బోధనా తీరును మంత్రి పరిశీలించారు. అభ్యర్థుల సమస్యలు, శిక్షణ కేంద్రంలో అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 3,400 మంది పేద విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని గురుకులాల్లో ప్రస్తుతం మూడు నీట్ శిక్షణ కేంద్రాలే ఉన్నాయని, వీటి సంఖ్యను 10కి పెంచుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఉన్నారు.

అవిశ్వాస తీర్మాన సమావేశంపై కలెక్టర్ సమీక్ష


డాబాగార్డెన్స్: మేయర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈ నెల 19న నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ దిశానిర్దేశం చేశారు. అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులతో గురువారం జీవీఎంసీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు కౌన్సిల్ హాల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన అనంతరం.. మొబైల్‌ను ఫ్లైట్ మోడ్‌లో పెట్టుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు తగిన గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు.

అడంగల్‌నూ మార్చేశారు!



చక్రం తిప్పిన 'సీతయ్య'

- సీసీఎల్ఏ స్థాయిలో కదిలిన పావులు
- చేతులు మారిన కోట్లు, రాత్రికి రాత్రి తెరపైకి కొత్త పేర్లు
- రక్షించుకునే అవకాశం ఉన్నా ప్రయత్నించని అధికారులు
- ప్రభుత్వ జాబితా నుంచి తొలగిస్తూ ఆదేశాలు
- రూ.200 కోట్ల భూమిలో అన్నీ వింతలే..



14-4 సర్వే నెంబరులోని 5.10 ఎకరాల పట్టాను రద్దు చేసి హౌసింగ్ బోర్డుకు అప్పగించిన అధికారులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇది రూ.200 కోట్ల విలువైన భూమి కథ. అడ్డంగా రికార్డులన్నీ మార్చేసి... ఇన్ని రోజులుగా నిషేధిత జాబితాలో ఉండి... ప్రభుత్వ భూమిగా పేర్కొన్న విలువైన భూమిని కాస్తా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన కథ. రికార్డుల్లో ఉన్న వ్యక్తికి కాకుండా మరో వ్యక్తికి కట్టబెడుతూ పై నుంచి వచ్చిన ఆదేశాలతో నడిచిన వ్యవహారమిది. పక్కనే ఉన్న 14–4 సర్వే నెంబరులోని 5.10 ఎకరాల తరహాలోనే పట్టాదారుకు ఉన్న పట్టాను రద్దు చేసి హౌసింగ్ బోర్డుకు అప్పగించినట్టు చేసే అవకాశాలన్నీ జారవిడిచారు.. కాదు కాదు జారవిడిచేలా కూటమి నేతలు చక్రం తిప్పారు. రూ.200 కోట్ల భూమిని కాస్తా ప్రభుత్వ భూమి జాబితాలో నుంచి తీసివేసి.. ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన కూటమి నేతలు ఆడిన కాసుల ఆటలో అంతిమంగా ప్రభుత్వ ల్యాండ్ బ్యాంకులో 5.10 ఎకరాల భూమి తరిగిపోయింది. రూ.200 కోట్ల విలువ చేసే ఈ భూమిలో ఉన్నతాధికారులతో పాటు కూటమిలోని 'సీతయ్య' చక్రం తిప్పి అటు భూమి, ఇటు కోట్లు వెనకేసుకున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

అన్నీ తికమకలే..!



చెట్టిపల్లి సీతారామయ్య పేరుతో 14-1 సర్వే నెంబరులో 5.10 ఎకరాలకు చెందిన అడంగల్

వాస్తవానికి ఎండాడలో 14–1 సర్వే నెంబరులోని 5.10 ఎకరాల భూమికి చెందిన రికార్డుల్లో రెవెన్యూ అధికారులనూ తికమకపెట్టే వ్యవహారాలు తెరవెనుక నడిచాయి. రికార్డుల్లో ఒక పేరు.. ఆదేశాల్లో మరో పేరు.. అంతిమంగా ప్రభుత్వ భూమిని కాస్తా ప్రైవేటుపరం చేస్తూ నిర్ణయాలు వెలువడ్డాయి. పక్కనే ఉన్న భూమి కాస్తా (సర్వే నెంబరు 14–3లోని 12.25 ఎకరాలు) ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు (ఏపీ హెచ్‌బీ) పేరుతో ఉండగా.. ఈ సబ్ డివిజన్‌లోని భూమికి ఒక ప్రైవేటు వ్యక్తి పేరుపై రికార్డులు ఉన్నాయంటూ స్వయంగా కలెక్టర్ ఆదేశాలు జారీచేయడం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఎండాడలోని సర్వే నెంబరు 14–1లోని 5.10 ఎకరాలకు సంబంధించిన అడంగల్.. ఇందులో సర్వే నెంబరులోని భూమి చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద నమోదై ఉంది. అయితే, విచిత్రంగా తాజాగా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఈ భూమి మాజీ సైనిక అధికారికి చెందినదని.. చెట్టిపల్లి సీతారామయ్య పేరు కేవలం ఫారం–3లో మాత్రమే ఉందని పేర్కొన్నారు. అయితే, ఇందుకు భిన్నంగా అసలు వ్యక్తి సాగులోనే లేరని.. వై.బాలిరెడ్డికి చెందినదంటూ ఆయన పేరు మీద బదలాయించాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు.

పై నుంచి ఆదేశాలతో..!

వాస్తవానికి ఈ భూమికి సంబంధించిన ఫైలు గత కొద్దికాలంగా కలెక్టరేట్‌లో చక్కర్లు కొట్టినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా కిందిస్థాయి నుంచి రికార్డులను సృష్టించారనే విమర్శలున్నాయి. అడంగల్‌తో పాటు గతంలో స్వయంగా కలెక్టర్ సంతకంతో ఎండాడలోని సర్వే నెంబరు 14–1కు చెందిన 5.10 ఎకరాల భూమి పట్టాదారు చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద ఉందని... ఇది ప్రభుత్వ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయవద్దని పేర్కొంటూ జిల్లా రిజిస్ట్రార్‌కు పంపారు. ఇక అడంగల్ కూడా ఈయన పేరు మీదనే ఉంది. అయినప్పటికీ సీతారామయ్య పేరు కేవలం ఫారం–3లో మాత్రమే ఉందని, దీనిని తొలగించాలని కూడా కలెక్టర్ తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక ఇది మాజీ మిలిటరీ అధికారి వై.బాలిరెడ్డి పేరు మీద ఉందని.. అందువల్ల దీనిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జిల్లా అధికార యంత్రాంగానికి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు కూడా చకాచకా పావులు కదులుతున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పై నుంచి ఆదేశాలు వచ్చేందుకు విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన 'సీతయ్య' చక్రం తిప్పినట్టు సమాచారం. ఇందుకోసం ఆయన భారీగా నగదుతో పాటు ఎకరంన్నర భూమి కూడా లబ్ధిపొందినట్టు తెలుస్తోంది.

వాస్తవానికి ఏం చేయెచ్చు..!

ఎండాడలో 14–4 సర్వే నెంబరులోని 5.10 ఎకరాల భూమి చెట్టిపల్లి అప్పలరాజు పేరు మీద ఉందని.. అయినప్పటికీ పట్టాను రద్దు చేసి ఈ భూమిని హౌసింగ్ బోర్డుకు అప్పగించారు. ఇదే తరహాలో 14–1 సర్వే నెంబరులోని 5.10 ఎకరాల భూమిని కూడా (పట్టాదారు పేరు విషయంలో రికార్డుల్లో తారుమారుగా ఉన్న నేపథ్యంలో) రద్దు చేసి హౌసింగ్ బోర్డుకు అప్పగించే అవకాశం ఉంది. ఇక కొత్తగా వేరే వ్యక్తి పేరుతో రికార్డులు ముందుకు వచ్చిన పక్షంలో రూ.200 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వ భూమిగానే ఉంచేలా చేస్తే ప్రభుత్వ ఆస్తిని కాపాడే అవకాశం ఉండేది. గతంలో ఉన్న రికార్డులకు, తాజా రికార్డులకు మధ్య వ్యత్యాసంతో పాటు ఇన్ని రోజులుగా ప్రభుత్వ భూమిగానే ఆన్‌లైన్‌లో ఉన్న నేపథ్యంలో దీనిని రక్షించుకునేందుకు అవకాశం ఉంది. ఇవేవీ చేయకుండా చక్రం తిప్పిన సీతయ్య కాస్తా అటు ఉన్నతాధికారులకు, ఇటు అధికార పార్టీలోని చినబాబుకు భారీగా ముట్టచెప్పారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని గృహ యజమానులు, ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ముఖ్య గమనిక. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాలపై 50 శాతం వడ్డీ రాయితీ గడువును ఈ నెల 30 వరకు పొడిగించారు. గతంలో ఈ రాయితీ గడువు మార్చి 31తో ముగిసినప్పటికీ, ఆ నెలలో ఎక్కువ సెలవులు రావడంతో చాలా మంది పన్ను చెల్లించలేకపోయారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం కల్పిస్తూ గడువును ఈ నెల 30 వరకు పొడిగించారు. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఈ నెల 30 లోగా ఒకే సారి చెల్లిస్తే.. ప్రభుత్వం 5 శాతం రాయితీ అందిస్తోంది. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

పాలిసెట్‌కు 14 వేల మంది దరఖాస్తు

మురళీనగర్: పదోతరగతి అనంతరం సాంకేతిక విద్యనభ్యసించేందుకు నిర్వహించనున్న పాలిసెట్‌కు విశేష స్పందన లభించింది. పాలిసెట్ దరఖాస్తు గడువు గురువారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి విశాఖ జిల్లాలో 14 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. పెందుర్తి, కంచరపాలెం, భీమిలి కో ఆర్డినేషన్ కేంద్రాల పరిధిలో వీరు దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా సమన్వయాధికారి, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. గతేడాది కన్నా పది శాతం అధికంగా పాలిసెట్‌కు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 30న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాలిసెట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిర్వహణ ఏర్పాట్లపై త్వరలో ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో సమావేశంకానున్నట్లు వెల్లడించారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్ఎస్) తీసుకున్న ఉద్యోగులకు గురువారం గ్రాట్యుటీ చెల్లించారు. స్టీల్‌ప్లాంట్ నుంచి 1,126 మంది వీఆర్ఎస్ తీసుకున్న విషయం విదితమే. చివరి రోజు మార్చి 31న యాజమాన్యం అందరికీ వీఆర్ఎస్ అమౌంట్‌ను చెల్లించింది. లీవ్‌లు తక్కువగా నిల్వ ఉన్న ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు ప్రారంభించింది. మిగిలిన ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) చెల్లింపుల కోసం యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. తక్కువ ఉన్న వారికి ముందుగా చెల్లించేందుకు చూస్తోంది.

విప్ ధిక్కరిస్తే రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టే..

- ఫ్యాన్ గుర్తుతో గెలిచిన ఫిరాయింపుదారులకు మాజీ మంత్రి హెచ్చరిక
- బీసీ మహిళా మేయర్‌ను తొలగించేందుకు కూటమి కుట్రలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్ సీపీ నేతలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి గుడివాడ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, తైనాల

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ గుర్తుపై విజయం సాధించి, ఇప్పుడు పార్టీ ఫిరాయించిన 27 మంది కార్పొరేటర్లు విప్ ధిక్కరిస్తే.. మరో 48 గంటలు మాత్రమే వారికి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. 19న అవిశ్వాస తీర్మానంపై జరిగే కౌన్సిల్ సమావేశాన్ని స్నేహపూర్వక వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని గురువారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అవిశ్వాస తీర్మానంపై కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని.. దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్‌ను కోరామన్నారు. మీడియా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో సమావేశం జరగాలని, అసాంఘిక శక్తులను అనుమతించకూడదన్నారు. కూటమి నేతలు వైస్రాయ్ హోటల్ రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కూటమికి అనుకున్న సంఖ్యాబలం లేకపోయినా హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ తరఫున విప్ జారీ చేస్తామని, ఈ మేరకు లేఖను కూడా కలెక్టర్‌కు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ గుర్తుతో గెలిచిన వారు అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని విప్ జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. విప్ ధిక్కరిస్తే వాళ్ల బతుకు కుక్కలు చింపిన విస్తరేనని హెచ్చరించారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి టీడీపీలో చేరిన 23 మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఏమైందో కార్పొరేటర్లు గుర్తెరగాలని సూచించారు. రాజకీయ జీవితం, భవిష్యత్తు కావాలనుకునే వాళ్లు ఇలాంటి పనులు చేయరని స్పష్టం చేశారు. నిజంగా వారికి దమ్ముంటే.. పార్టీకి, పార్టీ ద్వారా వచ్చిన పదవులకు కూడా రాజీనామాలు చేయాలని అమర్‌నాథ్ సవాల్ విసిరారు. పొరపాటున ఎవరైనా ఓటేస్తే విప్ ధిక్కరణకు గురై పదవులను కోల్పోతారని హెచ్చరించారు. మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై గెలిచి విప్‌ను ధిక్కరించిన వారిపై 24 గంటల్లో న్యాయ పరమైన చర్యలు తప్పవన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ మహిళను 11 నెలల కాలం కూడా మేయర్ పీఠంపై ఉండనీయకుండా కుట్రలు పన్నుతుండటం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గ, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీతోనే..

- కుమారుడు పార్టీ మారడంపై కంటతడి పెట్టిన మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి
- దేవన్‌రెడ్డిని రాజకీయ వారసుడిగా ప్రకటన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ తనకు అమ్మ వంటిదని.. తన ప్రాణం ఉన్నంత వరకూ ఆ పార్టీతోనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్పష్టం చేశారు. బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డితో కలసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి వైఎస్సార్ సీపీని వీడి జనసేనలో చేరడంతో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. విలేకరుల సమావేశంలో, పార్టీ నాయకుల సమక్షంలోనే ఆయన కంటతడి పెట్టారు. తన రాజకీయ వారసుడు తిప్పల దేవన్‌రెడ్డి అని ప్రకటించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు. ఇటీవల తన కుటుంబంలో జరిగిన పరిణామాలు తెలిసినవేనన్నారు. గాజువాక నియోజకవర్గంలో పార్టీని మరింతగా బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో వంశీరెడ్డికి సముచిత స్థానం కల్పించామని గుర్తు చేశారు. పార్టీ చేసిన మేలును మరిచి మరో పార్టీ కండువా కప్పుకోవడం సమంజసం కాదన్నారు. వంశీరెడ్డి పార్టీ మారతానని గానీ, ఆ దిశగా ఆలోచన ఉన్నట్టు గానీ తనకు ఏనాడూ తెలియజేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం తథ్యమన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావడం ఖాయమన్నారు. గాజువాక నుంచి తన కుమారుడు తిప్పల దేవన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో కొండా రాజీవ్, రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, కోమటి శ్రీనివాసరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, మంత్రి శంకరనారాయణ, బొడ్డ గోవింద్, కులుకూరి మంగరాజు, రోజారాణి, జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేస్తాం

- ధిక్కరిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం
- అప్పటికీ న్యాయం జరగకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం
- శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ




మాట్లాడుతున్న రాష్ట్ర శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: నగర మేయర్‌కు సంబంధించి అవిశ్వాస తీర్మానంపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఓటింగ్ జరగాలని కలెక్టర్‌ను కోరినట్లు రాష్ట్ర శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తెలిపారు. వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన 58 మంది కార్పొరేటర్లకు పార్టీ నుంచి విప్ జారీ చేస్తామని, ధిక్కరించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా అధికార బలంతో కూటమి నేతలు అడ్డుకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. లాసన్స్‌బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రలోభాలు, భయభ్రాంతులకు గురిచేసి తమ పార్టీలో కొందరు కార్పొరేటర్లను లాక్కొన్నారని, పార్టీ నుంచి కొందరు ఫిరాయించినా కౌన్సిల్‌లో తమకు బలం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 19న జరిగే అవిశ్వాస ఓటింగ్‌కు వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంటుందని స్పష్టం చేశారు. జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించిందని, మేయర్ నాలుగేళ్లపాటు నిజాయితీగా పాలన అందించారన్నారు. బీసీలపై ప్రేమతో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాదవ సామాజికవర్గానికి చెందిన బీసీ మహిళకు మేయర్ పదవి ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కుట్రతో మేయర్ పదవిని దక్కించుకునేందుకు.. బీసీ మహిళపై అవిశ్వాసం పెట్టారన్నారు. ఈ పరిణామాలను రాష్ట్రంలోని బీసీలంతా చూస్తున్నారని.. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారని బొత్స అన్నారు.

అవిశ్వాసం వేళ అరాచకాలకు తెర

- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు రూ.కోట్లు ఎర
- లొంగకుంటే బేరాలు, బెదిరింపులు
- విప్ జారీ చేస్తామని వైఎస్సార్‌సీపీ ప్రకటన
- అంతా గమనిస్తున్న ప్రజలు



డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ పీఠాన్ని అడ్డదారుల్లో దక్కించుకునేందుకు కూటమి నేతలు తెర వెనుక అప్రజాస్వామిక ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశం దగ్గర పడడంతో మరింత బరితెగిస్తున్నారు. అవసరమైన సంఖ్యా బలాన్ని కూడగట్టేందుకు కుట్రలకు తెరతీస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు కోట్లాది రూపాయలు మంచినీరులా వెచ్చిస్తున్నారు. ఒక్కో కార్పొరేటర్‌కు ఏకంగా రూ.25 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం నేరుగా రంగంలోకి దిగడం గమనార్హం. కొందరికి భారీ మొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తూ.. మరికొందరి వ్యాపారాలు అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డారు. లొంగని వారి ఆస్తులు ధ్వంసం చేస్తామని బహిరంగంగానే హెచ్చరించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలోనూ ఇదే తరహా అప్రజాస్వామిక విధానాలు అవలంబించి స్థానిక సంస్థలను చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం..ఇప్పుడు విశాఖ నగర పీఠాన్ని కూడా తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చేస్తున్న కుట్రలు తారాస్థాయికి చేరాయి.

భయభ్రాంతులకు గురి చేసి..

మేయర్ పీఠం కోసం నెల రోజులుగా టీడీపీ, జనసేన నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. కేవలం 11 నెలలు ఉన్న పదవీ కాలాన్ని చేజిక్కించుకోవడానికి ఫ్యాన్ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురి చేసి పార్టీలో చేర్చుకున్నారు. ముఖ్యంగా విశాఖ మేయర్ పీఠంపై యాదవ సామాజిక వర్గానికి చెందిన బీసీ మహిళ కూర్చోవడాన్ని జీర్ణించుకోలేక పెద్ద ఎత్తున కుట్రలకు తెరతీశారు.

అవిశ్వాసంపై వైఎస్సార్‌సీపీ ధీమా

జీవీఎంసీలో కూటమికి బలం లేకపోయినా, ప్రభుత్వ పెద్దలు కుతంత్రంతో విశాఖ మేయర్ పీఠాన్ని అడ్డదారిలో దక్కించుకోవడానికి ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ అవిశ్వాసంలో నెగ్గడం ఖాయమంటూ వైఎస్సార్‌సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన 58 మంది సభ్యులకు విప్ జారీ చేసింది. పార్టీ విప్ ధిక్కరించి సమావేశానికి హాజరయ్యే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

నిస్సిగ్గు

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా నిస్సిగ్గుగా కార్పొరేటర్లు పార్టీలు మారడం దారుణం.. పార్టీ మారాలనుకునే వారు ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలి. ఓ పార్టీ జెండాపై గెలిచి మరో పార్టీలో చేరడానికి మిమ్మల్ని ప్రజలు ఎన్నుకున్నారా అంటూ నగర పౌరులు ప్రశ్నిస్తున్నారు. నిజంగా దమ్ము.. ధైర్యం ఉంటే.. తిరిగి ఎన్నికల్లో నిలబడి సత్తా ఏంటో నిరూపించుకోవాలని సూచిస్తున్నారు.

కార్పొరేటర్ల కొనుగోలు నీతి బాహ్యం..

11 నెలల పదవి కోసం కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వామపక్ష కార్పొరేటర్లు ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. లక్షలాది రూపాయలిచ్చి కార్పొరేటర్లను కొనుగోలు చేయడం నీతి బాహ్యమైన చర్యగా పేర్కొన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్‌పై కూటమి కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానానికి దూరమని ఇప్పటికే ప్రకటించారు.



అపాయంలో ఉపాయం

ఏయూక్యాంపస్: ఫిషింగ్ హార్బర్‌లో గురువారం చిన్న బోటు ప్రమాదవశాత్తు నీటిలో తిరగబడిపోయింది. నలుగురైదుగురు వ్యక్తులు సాయం చేస్తే గానీ బోటును సాధారణ స్థితికి తేవడం సాధ్యపడదు. అయితే ఆ సమయంలో బోటు యజమానికి ఎవరూ అందుబాటులో లేరు. అయినా అతను అధైర్యపడలేదు. కొంచెం ఆలోచించి తన బుద్ధిబలాన్ని ఉపయోగించాడు. ఒక కర్రను ఆధారంగా చేసుకుని ఎంతో చాకచక్యంగా ఆ బోటును మళ్లీ యథాస్థితికి తీసుకొచ్చాడు. ఉపాయం ఉంటే ఎలాంటి అపాయాన్ని అయినా జయించవచ్చనే సామెతను ఈ సంఘటన నిజం చేసింది. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాల్లో బంధించింది.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పోర్టు స్టేడియంలోనే డీఎస్పీ మ్యూజికల్ నైట్

సీతమ్మధార: ఈ నెల 19న పోర్టు స్టేడియంలో దేవిశ్రీప్రసాద్(డీఎస్పీ) మ్యూజికల్ నైట్ యథావిధిగా జరుగుతుందని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి తెలిపారు. కొద్ది రోజుల కిందట నిర్వాహకులు మ్యూజికల్ నైట్ కోసం దరఖాస్తు చేసుకోగా.. భద్రతా ఏర్పాట్లులేవని పోలీసులు దరఖాస్తును తిరస్కరించారు. దీంతో పోలీసులు సూచించిన భద్రతా ఏర్పాట్లు చేస్తూ, నిర్వాహకులు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు గురువారం సీఐలు సత్యనారాయణ, అమ్మినాయుడు స్టేడియంను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏసీపీ అనుమతినిచ్చారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
PRE-PRIMARY :
Mother Teacher
MIDDLE & HIGH SCHOOL :
Social Studies, PET
Interested candidates may walk in interview only on school working days from 9.00 am to 4.00 pm
Send your resumes to mail id: ramakrishnaschool@yahoo.com
RAMAKRISHNA SCHOOL
NAD KOTHA ROAD, VIZAG-27
9848532315

దూరవిద్యలో ఏం జరుగుతోంది..?

- 21 నుంచి యూజీ, పీజీ పరీక్షలు
- కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు స్కెచ్
- అబ్జర్వర్ల నియామకంలో చక్రం తిప్పిన ఉద్యోగి
- అవకతవకలపై రిజిస్ట్రార్ ధనుంజయరావు సీరియస్
- వాగ్దేవి దూరవిద్య పరీక్ష కేంద్రం రద్దు

విశాఖ విద్య: కొత్తవలసలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని రద్దు చేస్తున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన డిస్టెన్స్ పరీక్షల్లో వాగ్దేవి కళాశాలలో అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులతో నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి మే 8 వరకు జరగనున్న యూజీ, పీజీ పరీక్షలకు ఈ కేంద్రం కేటాయించిన విద్యార్థులు కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే డిస్టెన్స్ విభాగం డిగ్రీ, పీజీ పరీక్షలపై గురువారం కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లతో డిస్టెన్స్ విభాగం డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్ ఏయూలోని సీడీవోఈ సెమినార్ హాల్లో సమావేశం నిర్వహించారు. దీనికి రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు కూడా హాజరై కేంద్రాల నిర్వాహకులకు క్లాస్ తీసుకున్నారు. పరీక్షల నిర్వహణ తీరు మెరుగుపడకపోతే, లెర్నింగ్ సెంటర్లలో పరీక్ష కేంద్రాలను తప్పించి, ప్రభుత్వ కాలేజీలనే పరీక్ష కేంద్రాలకు ఎంపిక చేస్తామని హెచ్చరించారు.

అనుకూలమైన వారే అబ్జర్వర్లు

ఏయూ దూర విద్య విభాగం పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 83 కేంద్రాలు ఉండగా, వీటి ద్వారా యూజీ 17,651 మంది, పీజీ 7,557 మంది ప్రవేశాలు పొందారు. వీరందరికీ ఈ నెల 21 నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే పరీక్షల్లో పెద్ద ఎత్తున మాస్‌కాపీయింగ్‌కు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. అబ్జర్వర్ల నియామకంలో డిస్టెన్స్ విభాగంలోని ఓ ఉద్యోగి చక్రం తిప్పి, డబ్బులు ముట్టజెప్పిన వారికి కావాల్సిన సెంటర్‌లో నియమించినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర విచారణ జరిపగా డిస్టెన్స్ విభాగంలోని అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



ఏయూలోని దూర విద్య ప్రధాన కార్యాలయం

వసూళ్లతో.. మాస్ కాపీయింగ్

ఈ నెల 21 నుంచి జరిగే డిస్టెన్స్ పరీక్షలకు కేంద్రాల ఎంపిక పూర్తయింది. విద్యార్థులకు హాల్ టికెట్లు కూడా జారీ అయ్యాయి. ఈ దశలో కొత్తవలసలోని వాగ్దేవి కాలేజీ కేంద్రాన్ని రద్దు చేయటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. గత సెమిస్టర్ పరీక్షల్లో జరిగిన లోపాలను మరుసటి సెమిస్టర్ పరీక్షలు జరిగేంత వరకు గుర్తించకపోవటం డిస్టెన్స్ విభాగంలో ఏదో జరుగుతోందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. డిస్టెన్స్ విధానంలో డిగ్రీ, పీజీ పరీక్షలు రాసే వారి నుంచి పేపరుకు ఇంత అని డబ్బులు వసూలు చేస్తూ, కొన్ని కేంద్రాల్లో పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నందునే.. ఈ రచ్చకు కారణంగా తెలుస్తోంది. ఏయూ పాలనాధికారులు ఇప్పటికైనా డిస్టెన్స్ పరీక్షల నిర్వహణపై దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

పోక్సో కేసుల్లో ఎక్కువ మంది యువతే

- ప్రేమ ఉచ్చులో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దు
- 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' లో హోం మంత్రి అనిత పిలుపు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనిత

బీచ్‌రోడ్డు: తెలిసీ తెలియని వయసులో ప్రేమ ఉచ్చులో పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, యువత ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనా వేదికగా విశాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రేమ ముసుగులో యువత బలైపోతోందని, ఆవేశంలో చేసిన తప్పులకు జైలు పాలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో 60 శాతం మంది 18–20 ఏళ్ల లోపు వారే ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. గంజాయి కేసుల్లో కూడా చాలా మంది చిన్న వయసు వారే ఉన్నారన్నారు. మహిళా రక్షణకు కలిసికట్టుగా అనే కార్యక్రమానికి రాష్ట్రంలో మొదటిసారిగా విశాఖ నుంచి శ్రీకారం చుట్టామని, ఇది మహిళల రక్షణ, ధైర్యానికి ఒక చక్కని వేదిక అవుతుందన్నారు. స్వీయ నియంత్రణ అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. మన కోసం నిరంతరం కష్టపడుతున్న తల్లిదండ్రుల కోసం ఒక్క క్షణం ఆలోచించాలని సూచించారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వలనే ఇదంతా జరుగుతోందని, పోక్సో, ఇతర చట్టాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. మత్తు పదార్థాలు భవిష్యత్‌ను నాశనం చేస్తాయని, వాటికి దూరంగా యువత ఉండాలని సూచించారు. ఏయూ లాంటి విద్యా సంస్థల్లో చదవడం అదృష్టంగా భావించాలని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇలాంటి విద్యా వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడేందుకు చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా రాజకీయాలకు అతీతంగా వీసీని నియమించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవరినీ హౌస్ అరెస్టులు చేయలేదని గుర్తు చేశారు. తిరుపతిలో ఎవరినీ నిర్బంధించలేదని స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఏయూ వీసీ రాజశేఖర్ యువతకు పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్టార్ రేటెడ్‌తోనే ఇంధన పొదుపు, కాలుష్య నివారణ

- ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ చంద్రం



ట్యూబ్‌లైట్స్, సీలింగ్ ఫ్యాన్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ చంద్రం, బీఈఈ, ఐసీఎఫ్ అధికారులు

సాక్షి, విశాఖపట్నం : భారత ప్రమాణాల బ్యూరో(బీఈఈ) సూచించిన స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాల వినియోగంతో ఇంధన పొదుపుతో పాటు కర్బన ఉద్గారాల నియంత్రణ సాధ్యమవుతుందని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) చంద్రం అన్నారు. డిస్కమ్‌ల సామర్థ్య నిర్మాణం, డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన సామర్థ్య నిర్వహణ(డీఎస్ఎం) అంశంపై నగరంలోని ఓ హోటల్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. ఈపీడీసీఎల్, బీఈఈ, ఐసీఎఫ్ సహకారంతో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు డీఎస్ఎంకి ఉపయుక్తమయ్యే విధానాలపై చర్చించారు. బీఈఈ, ఐసీఎఫ్ కన్సల్టింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగం తగ్గించడమే లక్ష్యంగా గృహ విద్యుత్ పరికరాలను ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ చంద్రం మాట్లాడుతూ డీఎస్ఎం సూచించిన పరికరాలను వినియోగిస్తే విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ఏపీఎస్ఈసీఎం సీఈవో ఓఎస్‌డీ శివరామ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖలో ప్రారంభించిన కార్యక్రమం ఏపీ, కేరళ, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లోని డిస్కమ్‌లలోనూ సాగుతుందన్నారు. గృహ విద్యుత్ రంగంలో 10 లక్షల ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, 8 లక్షల బీఎల్‌డీసీ ఫ్యాన్‌ల పంపిణీ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఐసీఎఫ్ కన్సల్టింగ్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్ ఎండీ గురుప్రీత్ చుగ్ తెలిపారు. వాణిజ్య రంగంలో 4 లక్షల ట్యూబ్‌లైట్లు, 1.6 లక్షల ఫ్యాన్‌లు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఈపీడీసీఎల్ ఎనర్జీ కన్జర్వేషన్ సోలార్ ఎనర్జీ సీజీఎం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో బీఈఈ, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

INTEGRATED TRIBAL DEVELOPMENT AGENCY
RAMPACHODAVARAM, ASR DISTRICT-533288.
E-PROCUREMENT TENDER NOTICE (2nd CALL)
Rc.No.A3/ITDA/30/VDVK/2025, dated 18-04-2025.
Online tenders are invited for supplying of Cashew Machinery equipment to the VDVKs in Rampachodavaram Division with an estimated amount of Rs.85,00,000/- approximately through http://tender.apeprocurement.gov.in. Download date of tender schedule is 18-04-2025 - 4.00 PM to 01-05-2025 - 11.00 AM. Interested tenderers should submit their tenders through online before the tender closing date 01-05-2025 1.00 PM. Tender opening date 01-05-2025 3.00 PM. All terms and conditions mentioned in Tender documents.
Sd/- Katta Simhachalam, IAS., Project Officer,
ITDA, Rampachodavaram.

దిగొచ్చిన జిల్లా క్రికెట్ సంఘం

- అర్హత ఉన్న అందరికీ ట్రయల్స్‌కు అవకాశం

విశాఖ స్పోర్ట్స్: విశాఖపట్నం జిల్లా క్రికెట్ అసోసియేషన్(వీడీసీఏ) ఎట్టకేలకు దిగొచ్చింది. అండర్–23 క్రికెట్ ట్రయల్స్‌లో అందరికీ అవకాశం కల్పిస్తున్నట్లు ఓ ప్రకటన విడుదల చేసింది. మొదట కేవలం గత మూడేళ్లుగా వీడీసీఏకు ఆడిన కొద్ది మంది క్రీడాకారులకే అవకాశం కల్పిస్తూ జాబితా సిద్ధం చేయడంతో.. ట్రయల్స్‌కు సిద్ధమైన ఔత్సాహిక క్రికెటర్లు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమను కనీసం ట్రయల్స్‌లో పాల్గొనడానికి కూడా అనుమతించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి ఎదురైందని, ఏడాది పొడవునా ప్రైవేట్ అకాడమీల్లో కష్టపడి శిక్షణ పొందినా ఫలితం లేకపోయిందని వాపోయారు. కనీసం పేరు నమోదుచేసుకోరా? వీడీసీఏ బి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ కూడా చేసుకోనివ్వరా అంటూ ఔత్సాహిక క్రీడాకారులు ఆవేదన చెంది అంతా కలిసి మీడియా ముందుకు వచ్చారు. తమలో ప్రతిభ ఉందో లేదో తెలుసుకునే అవకాశం ఇవ్వాలని, ఓపెన్ ట్రయల్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లలో వీడీసీఏకి ఆడిన వారే అంటూ ఓ జాబితా తయారుచేసుకుని వారికే ట్రయల్స్ నిర్వహిస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. అసలు ట్రయల్స్ చేస్తున్నట్టే ప్రకటించకుండా.. తీరా కిట్స్‌తో సహా వస్తే పోయి సెక్రటరీనో మరొకరినో కలిసి పర్మిషన్ తెచ్చుకోమంటూ పంపేయడమేంటని ఆవేదన చెందారు. వీడీసీఏ బైలాస్‌కు విరుద్ధంగా బయట టోర్నీలు ఆడిన వారికి అవకాశం కల్పిస్తూ, తమను ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై 'సాక్షి'దినపత్రికలో ' క్రికెట్ జట్టు ఎంపికలో క్లబ్ ఆటగాళ్లకే అవకాశమా?' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో వీడీసీఏ పెద్దలు స్పందించారు. తాజాగా వీడీసీఏ తమ నిర్ణయాన్ని మార్చుకుంది. ప్రాబబుల్స్‌గా బ్యాటింగ్‌కు 27 మంది, వికెట్ కీపింగ్‌కు ఐదుగురు, పేసర్లుగా 14 మందితో పాటు స్పిన్నర్లుగా మరో 13 మందితో తయారు చేసిన జాబితాతో పాటు వయసు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చని ప్రకటించింది. దీంతో ఔత్సాహిక క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

నేడు, రేపు ట్రయల్స్

అండర్–23 క్రికెట్ జట్టులో స్థానం సంపాదించడం ద్వారా సీనియర్(ఆంధ్ర రంజీ) జట్టు, ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో ఆడేందుకు అవకాశం లభిస్తుంది. ఈ ముఖ్యమైన ఎంపిక ప్రక్రియ ఈ నెల 18, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ బి గ్రౌండ్‌లో జరుగుతుంది. గత మూడు సీజన్లలో అండర్–19, అండర్–23 స్థాయిలో వీడీసీఏకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లతో మొదట జాబితా రూపొందించారు. ఇప్పుడు 2025–26 సీజన్‌లోని వన్డే, మల్టీడే ఫార్మాట్‌ల కోసం 2002 సెప్టెంబర్ 1న లేదా తర్వాత జన్మించిన ఎవరైనా ఈ ఎంపికలకు అర్హులని వీడీసీఏ ప్రకటించింది. కాబట్టి ఆయా తేదీల్లో జన్మించిన యువ క్రికెటర్లు మున్సిపల్ అథారిటీ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 18న సమర్పించి ట్రయల్స్‌లో పాల్గొనవచ్చు. అర్హత కలిగిన యువ క్రికెటర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వీడీసీఏ సూచించింది.

డ్రైవర్‌గా చేరి ప్రైవేటు వీడియోలతో బ్లాక్ మెయిల్

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబాన్ని వేధిస్తున్న అప్పలరాజు అరెస్టు



నిందితుడు అప్పలరాజు (ఫైల్)

సీతమ్మధార: ప్రైవేటు వీడియోలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న కారు డ్రైవర్ అప్పలరాజును ద్వారకా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేకూరి గిరీష్, భార్య పిల్లలతో కలిసి సీతమ్మధార ప్రాంతంలో నివాసముంటున్నారు. అతనికి అంగవైకల్యం కారణంగా పిల్లలను చూసుకోవడానికి, ఇంటి పనుల కోసం డ్రైవర్‌గా రామెళ్ల అప్పలరాజును పెట్టుకున్నాడు. అతడు నమ్మకంగా ఉండడంతో వారి మధ్య స్నేహం పెరిగింది. ఒక రోజు గిరీష్‌ను హోటల్‌కు తీసుకెళ్లి అమ్మాయిని పరిచయం చేశాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న దృశ్యాలను అప్పలరాజు మొబైల్‌లో చిత్రీకరించాడు. కొద్ది రోజుల తరువాత ఆ వీడియోలు సాయంతో గిరీష్‌ను బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనకు రూ.లక్ష ఇవ్వాలని లేదంటే ఫొటోలు సోషల్ మీడియాలోను, కుటుంబ సభ్యులకు పంపిస్తానని బెదిరించాడు. దీంతో పరువు పోతుందని భావించిన గిరీష్ తన బంధువు సిబ్బంది ద్వారా ఆ మొత్తాన్ని ఏర్పాటు చేసి ఆరు యూపీఐ లావాదేవీల ద్వారా డ్రైవర్‌కు బదిలీ చేశారు. చాలా కాలంగా గిరీష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను డ్రైవర్ అప్పలరాజు వేధిస్తూ వచ్చాడు. ఎప్పటికప్పుడు డబ్బులు తీసుకుంటున్నాడు. ఐఫోన్16 ప్లస్‌ను కూడా కొనుగోలు చేయించుకున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న గిరీష్‌ను అప్పలరాజు కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.5 వేలు బలవంతంగా తీసుకున్నాడు. అలాగే గిరీష్ తన భార్య పేరు మీద కొనుగోలు చేసిన ఫ్లాట్‌ను కూడా కాజేయడానికి ప్రయత్నించాడు. అంతటితో ఆగకుండా గిరీష్ వీడియోలు అతని భార్యకు పంపించి ఆమెను సైతం వేధింపులకు గురి చేశాడు. వీరి పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి అక్కడ పోలీస్ స్టిక్కర్ ఉన్న కారును పార్క్ చేసేవాడు. డ్రైవర్ అప్పలరాజు వేధింపులను భరించలేక గిరీష్ చివరకు ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అప్పలరాజును అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు పంపించారు. అతడి నుంచి నకిలీ పిస్టల్‌తో పాటు కొంత మొత్తంలో నగదు, కారు, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, BADDI ESWARAMMA (New Name) W/o Baddi Srinivas Resident at D.No. 16-14, Satya Sai Nagar, Salagramapuram, Visakhapatnam - 530024 (A.P). Now changed my name from BADDI ESWARI (Old Name) To BADDI ESWARAMMA (New Name) Henceforth I will be called as BADDI ESWARAMMA (New Name) for all purpose.

CHANGE OF NAME
I, GUNTURU LAKSHMIMANI (New Name), W/o. Gunturu Gopala Krishna, previously called as G V LAKSHMIMANI (Old Name) resident of Flat No: GF-101, Akash Residency, Bakkannapalem, Madhurawada, Visakhapatnam, Andhra Pradesh-530046. Now changed my name from G V LAKSHMIMANI (Old Name) to GUNTURU LAKSHMIMANI (New Name). Henceforth I will be called as GUNTURU LAKSHMIMANI (New Name) for all purposes.

CHANGE OF NAME
I, THOTA PAWANKUMAR (new name) previously called THOTA PAVAN KUMAR (old name), S/o THOTA RAJU, resident of 8-4-018, Masque Street, VTC. Yanam, Pondicherry - 533464. Now changed my name THOTA PAVAN KUMAR (old name) to THOTA PAWANKUMAR (new name) Hence forth I will be called as THOTA PAWANKUMAR for All purpose

CHANGE OF NAME
I, NIDHI RAWAT (New Name), W/o. DEEPAK SINGH, previously called as NIDHI MAHAR (Old Name) resident of H.No. E-18, Panchavati Township, Near Sheela nagar Jn., Visakhapatnam, Andhra Pradesh-530012. Now changed my name from NIDHI MAHAR (Old Name) to NIDHI RAWAT (New Name). Henceforth I will be called as NIDHI RAWAT (New Name) for all purposes.

పేరు మార్పు
... Bosa Venkata Lakshmi ... Bosa Venkata Laxmi ... Bosa Venkata Laxmi ... Bosa Venkata Lakshmi ... Bosa Venkata Lakshmi ...

OLD AGE HOME
వృద్ధుల ఆశ్రమం, పెద్దల ఆసుపత్రి ఆహ్లాదకరమైన వాతావరణం, మంచి భోజనం, అతి తక్కువ ఖర్చుతో మీ ఇంటివద్దకే ఆరోగ్య సేవలు, మురళీనగర్. ఫోన్: 98495 28495, 96404 28395
[SCA25002619]



Wanted
సాయిరామ్ హోంకేర్Hydలో బేబీ&పేషెంట్ కేర్ ముసలివారిని చూసుటకు ఆయాలు/నర్సులు ఇంటి/వంటపనికి ఆడ/ మగ కావలెను. జీ: 18 వేలు ఫోన్:9949094607, 9908454607.
[SCA25002754]



Real Estate

LAND FOR SALE
Jami - S.Kota Road 5.2 acres @ 43 Lakhs per Acre 500 Mtrs. from Main Road Nr. Greenfield Highway Jami Exit, Suitable for farm houses etc.. Ph : 95505 40096
[V- 724]

TO-LET / COMMERCIAL
Business opportunity : Fully Furnished Coffeeshop & Restaurant is for rent at Prime area Lawsonsbay Colony. Cont : 96404 26789
[V- 979]



Services

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300
[V- 13197]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మురళీనగర్, మాధవధార : 90101 33346
NAD, కంచరపాలెం : 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి : 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్ : 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం : 90101 96663
గాజువాక : 97059 33394
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- దిశా సమావేశంలో అధికారులకు ఎంపీ ఆదేశం



దిశా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీ భరత్, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యేలు

మహారాణిపేట: విద్య, వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధికారులంతా కృషి చేయాలని, జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన దిశా (జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానటరింగ్ కమిటీ) సమావేశంలో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరు తెన్నులపై, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎంపీ చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న చర్యలను సమీక్షించిన అనంతరం, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్న పథకాల ఫలితాలు ప్రజలకు చేరేలా చూడాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లను వెంటనే పూడ్చాలని, కొత్తగా వేసిన రోడ్లను తవ్వకుండా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీ ఆదేశించారు. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్ల అభివృద్ధికి జీవీఎంసీ నిధుల వినియోగంపై పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే జిల్లాలోని డ్రెయిన్లు, మురుగునీటి కాలువల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. రాజీవ్ గృహకల్ప ఇళ్లను వినియోగంలోకి తీసుకురావాలని, మరమ్మతులు చేసి అర్హులకు అందించాలని, వినియోగించని వారికి నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. ఉత్తర నియోజకవర్గంలోని కప్పరాడ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రస్తావించగా.. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఎంపీ ఆదేశించారు. తప్పుడు పత్రాలు సమర్పించే వారికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు సూచించారు.

నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు

యువతకు, ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేయాలని, పీఎంఈజీపీ ద్వారా ఉపాధి కల్పించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. గుర్తించిన క్రీడా మైదానాలు, స్టేడియంలను అభివృద్ధి చేయాలని, సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులను ప్రోత్సహించాలని, టిడ్కో, హుద్‌హుద్, రాజీవ్ గృహ కల్ప, పీఎం ఆవాస్ యోజన వంటి పథకాల కింద ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులను అభివృద్ధి చేయాలని, గాజువాక నుంచి లంకెలపాలెం వరకు సర్వీస్ రోడ్డు వేయాలని కోరారు. ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీలకు వచ్చే పిల్లల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన 95523 00009 వాట్సాప్ నంబర్ ద్వారా అన్ని ప్రభుత్వ సేవలు పొందవచ్చని ఎంపీ శ్రీ భరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా 'మన మిత్ర' పేరుతో రూపొందించిన వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖైదీలకు 'జ్యోతిర్గమయ' ఉపయోగకరం



సీపీ శంఖబ్రత బాగ్చికి మొక్క అందజేస్తున్న జైల్ సూపరింటెండెంట్ మహేష్‌బాబు

ఆరిలోవ: కేంద్ర కారాగారంలో శిక్షణ అనుభవిస్తున్న ఖైదీలు విడుదలైన తర్వాత బాహ్య ప్రపంచంలో పునరావాసం, ఉపాధి కల్పించడానికి 'జ్యోతిర్గమయ ప్రాజెక్టు' ఏర్పాటు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని గురువారం ఆయన సందర్శించారు. జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్ బాబు, అధికారులతో కలిసి పలు బ్యారక్‌లు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన జైళ్ల రక్షణపై జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైల్ సెక్యూరిటీ పటిష్టంగా ఉండాలన్నారు. ఖైదీలు క్రమశిక్షణతో మెలిగి బాహ్యప్రపంచంలోకి రావాలన్నారు. జ్యోతిర్గమయ ప్రాజెక్ట్ గురించి అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా జైలు నుంచి విడుదలైన ఖైదీల వివరాలు సీపీకి జైలు అధికారులు అందజేస్తారు. అలాంటి వారికి సీపీ కౌన్సెలింగ్ నిర్వహించి సమాజంలో క్రమశిక్షణతో జీవించడానికి అవసరమైన పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జైల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జైలు అధికారులు పాల్గొన్నారు.

పాత గంగవరం తీరంలో విద్యార్థి గల్లంతు



తనూష్(ఫైల్)

పెదగంట్యాడ: పాత గంగవరం తీరంలో ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. శ్రీనగర్, గాజువాక చైతన్య టెక్నో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు, గాజువాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసిన ఇద్దరు విద్యార్థులు స్నేహితులు. వీరందరూ కలసి మూడు సైకిళ్లపై గురు వారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో పాత గంగవరం తీరానికి వెళ్లా రు. అందరూ కలసి సముద్రంలో స్నానం చేసిన తర్వాత బయట వచ్చి ఇసుకలో ఆటలాడుతుండగా.. అందులో రోహిత్, భరత్, తనూష్ మళ్లీ సముద్రంలోకి వెళ్లారు. సరదాగా గడుపుతుండగా కెరటాల ఉధృతికి నడుపూరుకు చెందిన ఒసుం తనూష్(15) సముద్రంలోకి కొట్టుకొనిపోయాడు. విద్యార్థిని రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ఏసీపీ త్రినాథ్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. విద్యార్థి ఆచూకీ కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. తనూష్ తండ్రి మంగరాజు ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేట నిషేధ భృతి అర్హుల గణన నేడు

మహారాణిపేట: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం అర్హుల గణన జరగనుంది. జిల్లాలో ఉన్న 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ జిల్లా జేడీ ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. 18న బోట్ల గణన, బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీస్తామన్నారు. 19న ధ్రువపత్రాల సేకరణ, పరిశీలన జరిపి, 21లోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి వీరాంజనేయులు విస్తృత పర్యటన



సాంఘిక సంక్షేమ హాస్టల్స్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి వీరాంజనేయులు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి వీరాంజనేయులు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన పలు సూచనలు చేశారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌తో పాటు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం ఉద్యోగులు పనితీరు, అడ్మినిస్ట్రేషన్ పనితీరుపై ఆరా తీశారు. సంక్షేమ భవన్ పక్కనే ఉన్న సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ కార్యాలయాన్ని, మీటింగ్ హాల్‌ను పరిశీలించారు. పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లోని హాస్టళ్ల ఆధునికీకరణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ, ఈడీలు బీజేపీ జేబు సంస్థలా?

- మీడియాతో మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న చింతా మోహన్

డాబాగార్డెన్స్: దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున ఓ జడ్జి ఇంట్లో రూ.500 కోట్ల నల్లధనం దొరికితే చిన్న కేసు కూడా పెట్టలేని ప్రధాని మోదీ, అమిత్‌షా ఏం చేస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ప్రశ్నించారు. విశాఖలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చింతా మాట్లాడుతూ మాజీ సీఎం ఇంట్లో రూ.5 లక్షలు కనిపిస్తే పట్టుకుని, జడ్జి ఇంట్లో రూ.500 కోట్లు కనిపిస్తే ఈ రోజు దాకా కేసు ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీలు బీజేపీ జేబు సంస్థల్లా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఓ జడ్జిని కలిసేందుకు ఎవరు వెళ్లినా.. వాటర్ బాటిల్‌ను కూడా స్క్రీనింగ్ చేస్తారని.. అలాంటిది అంత డబ్బు జడ్జి ఇంట్లోకి ఎలా చేరిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు ఆస్తులపై వాదనలు విన్న తర్వాత, భారత రాజ్యాంగం అంటే ఏంటో కేంద్ర ప్రభుత్వానికి తెలియదనిపించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తిరిగి మామూలు వక్ఫ్ బోర్డు చట్టాన్ని తీసుకొస్తామన్నారు.

రాష్ట్రంలో వర్గీకరణ విషయానికొస్తే మాల, మాదిగల గూర్చి చంద్రబాబు చాలా బాధతో ఉపన్యాసం ఇచ్చారని, మైన్స్‌లో, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల్లో కూడా వర్గీకరణ జరగాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై ఈడీ కేసులు దారుణమని, దాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.